## క్లుప్తంగా

### నోటిఫికేషన్‌ను సవరించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ఇటీవల విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ పోస్టుల నోటిఫికేషన్‌ను సవరించి మరిన్ని పోస్టులు పెంచాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి యువజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. కోట శివ శంకర్ మాట్లాడుతూ... సింగరేణి యాజమాన్యం పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుందనే తొందరలో తప్పుల తడకగా నోటిఫికేషన్ విడుదల చేయడంతో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని తెలిపారు. ఇకనైనా సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరభద్రం, నిరుద్యోగులు పాల్గొన్నారు.

### రెండుపూటలూ తాగునీరు ఇవ్వండి


వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా కార్మిక ప్రాంతమైన రామవరంలోని 7 వార్డులకు రెండు పూటలా మంచినీరు విడుదల చేయాలని ఆ ప్రాంత సీపీఐ వార్డు కౌన్సిలర్లు సివిల్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి ఎద్దడిని నివారించేందుకు సింగరేణి కార్మిక ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముస్లింల పవిత్ర రంజాన్ మాసం, హోలీ, శ్రీ రామనవమి తదితర పండగలను దృష్టిలో పెట్టుకొని అధికారులు నిటిని విడుదల చేయించాలని కోరారు.

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్‌గా దావూద్



నియామకపత్రం అందుకుంటున్న దావూద్

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ పార్టీ కొత్తగూడెం మైనారిటీ టౌన్ వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఎండీ దావూద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని పొదెం వీరయ్య క్యాంప్ కార్యాలయంలో టీపీసీసీ సభ్యులు నాగసీతారాములు, జేబీ శౌరి అందజేశారు. దావూద్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ అవకాశాన్ని కల్పించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి, మైనారిటీ వర్గాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని వివరించారు.

### పాల్వంచవాసికి ఆర్టీసీ ఎండీ సన్మానం


అహ్మద్‌ను సన్మానిస్తున్న సజ్జనార్

పాల్వంచ: పాల్వంచకు చెందిన నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ సన్మానించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. నేతాజీ యువజన సంఘం స్థాపించి గత 30 సంవత్సరాలుగా సంఘ సేవా కార్యక్రమాలు చేస్తున్న అహ్మద్‌కు అభినందనలు తెలిపారు. కరోనా సమయంలో చేసిన సేవలను ప్రశంసించారు.

### కబడ్డీ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణ

ఇల్లెందురూరల్: మామిడిగుండాల గ్రామపంచాయతీ మేడికుంట గ్రామంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను కాంగ్రెస్ నాయకుడు ముక్తి కృష్ణ ప్రారంభించారు. పోటీలో వివిధ మండలాల నుంచి 32 జట్లు హాజరయ్యాయి. కార్యక్రమంలో ముక్తి రాజు, తోశం సురేష్, జిగట మారయ్య, ధరావత్ వీరేష్, పాయం అనిల్, శివ, కోరం నాగేశ్వరరావు, కుంజ కృష్ణ, పాయం ప్రశాంత్, చింత రాజేష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సి‘పాలకుల పరేషాన్’

- నిధులు లేక.. పనులు సాగక..
- ఎస్‌డీఎఫ్ నిధుల విడుదల కోసం సీఎం చెంతకు..
- రూ.25 కోట్లు నిధులు అందక అల్లాడుతున్న వైనం

ఇల్లెందు: గత ఏడాది ఇదే రోజుల్లో ఆనాటి సీఎం కేసీఆర్ ఇల్లెందు మున్సిపాలిటీకి ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 25 కోట్లు విడుదల చేస్తూ కొత్తగూడెంలో సభలో ప్రకటించారు. కానీ అవి సకాలంలో విడుదల కాలేదు. పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారింది. పనులు చేపట్టని నిధులు వెనక్కి పంపాలని ఆదేశించింది. దీంతో ఇల్లెందు మున్సిపాలిటీలో రూ.25 కోట్లతో చేపట్టనున్న 381 పనులు ఆగిపోయాయి. గతంలో చేపట్టిన అనేక పనులు అసంపూర్తిగా ఉన్న పనులను ఈ ఎస్‌డీఎఫ్ నిధులతో పూర్తి చేయాలని నిర్ణయించినప్పటికీ ఆ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం నూతన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు తొలిసారి విచ్చేసిన సందర్భంగా ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 25 కోట్లు విడుదల చేయాలని స్థానిక మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ద్వారా సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఆ నిధులు విడుదలైతేనే పనులు పూర్తయ్యేది.

**ఎస్‌డీఎఫ్ నిధుల కోసం..**

పట్టణంలోని 24 వార్డుల్లో కాలువల మీద కల్వర్టులు, వాగుల మీద బ్రిడ్జిలు, డ్రెయిన్లు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల మార్పిడి, రోడ్ల విస్తరణ, అసంపూర్తి పనులకు నిధులు కేటాయింపులు.. ఇలా పట్టణంలో చాలా అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 కోట్లలో రూ.8.82 కోట్లు కేటాయిస్తూ అసంపూర్తిగా ఉన్న 21 పనులను పూర్తి చేయాలని నిర్ణయించినప్పటికీ గ్రహణం వీడటం లేదు. ఇందులో మల్టీ యుటిలిటీ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మినీ స్టేడియం, వెజ్, నాన్‌వెజ్, మోడ్రన్ మార్కెట్లు, చెరువు సుందరీకరణ, ట్యాంక్ బండ్, లేక్ పార్క్ అభివృద్ధి, బంజారా భవన్, అంబేద్కర్ భవన్, గెస్ట్ హౌజ్, శ్మశానవాటిక, ఎస్ఎఫ్‌టీసీ సెంటర్, షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**పట్టణంలో చేపట్టనున్న పనులు..**

- ఇల్లెందు పట్టణంలో బుగ్గవాగు వరకు రూ.8 లక్షలతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ కాలువలో అక్రమ కట్టడాలు ఉండటం వల్ల ఆనాడు డ్రెయిన్ నిర్మాణం మధ్యలో వదిలేశారు.
- బర్లపెంట మీదుగా సత్యనారాయణపురం వరకు సీసీ రోడ్‌గా మార్చాలని నిర్ణయించారు. రూ. కోటి నిధులు కేటాయించారు.


అసంపూర్తిగా ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- మహబూబాబాద్ క్రాస్ రోడ్ నుంచి కరెంటాఫీస్– బీబీఆర్ రైస్ మిల్ వరకు రోడ్ విస్తరణ చేపట్టాల్సి ఉంది. రోడ్డుకు ఇరువైపులా సీసీ నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు.
- సభలు సమావేశాలు, విందులు, పెళ్లిళ్ల నిర్వహించుకునేందుకు పట్టణ నడిబొడ్డున మల్టీయుటిలిటీ సెంటర్ నిర్మాణం చేపట్టారు. నిధులు లేక మధ్యలో నిలిచిపోయింది. రూ.75 లక్షలు కేటాయించారు.
- నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. నిధులు సరిపడక నిలిచిపోయింది. ఈ భవనం పూర్తి చేయాలని రూ.70 లక్షలు కేటాయించారు.
- ఇల్లెందులపాడులోని వాగు మీద బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించారు.
- వార్డులలో వార్డు సభ్యుల ఆఫీస్‌ల కోసం రూ.72లక్షలు కేటాయించారు.
- మున్సిపాలిటీలో గెస్ట్ హౌజ్ నిర్మాణం నిధులు సరిపడక నిలిచిపోయింది. పూర్తి చేసేందుకు రూ.30 లక్షలు కేటాయించారు.
- 18వ వార్డులో బుగ్గ వాగు మీద లోలెవల్ కాజ్‌వే నిర్మాణం చేయాలని రూ.36 లక్షలు, మెయిన్ రోడ్‌లో సైడ్ డ్రెయిన్ నిర్మాణం కోసం రూ.30 లక్షలు కేటాయించారు. ఇక మున్సిపల్‌లో కంప్యూటర్స్, ఫర్నిచర్‌కు రూ.15 లక్షలు. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 8 లక్షలు, 1 నుంచి 24 వార్డులలో విద్యుత్ స్తంభాల మార్పిడి, నూతన స్తంభాలు ఏర్పాటుకు రూ. 32 లక్షలు, మంచినీటి చెరువు వద్ద పార్క్ పూర్తి చేసేందుకు రూ.25 లక్షలు కేటాయించారు.


నిధులు విడుదల చేయాలని సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ డీవీ, ఎమ్మెల్యే కనకయ్య(ఫైల్)

- పట్టణంలోని 3వ, 7వ, 8వ వార్డులలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.54 లక్షలు, 12వ వార్డులో వైకుంఠధామం రూ. 12 లక్షలు, కమ్యూనిటీ హాల్‌కు రూ.30 లక్షలు, 16వ వార్డులో కమ్యూనిటీ హాల్ రూ. 30 లక్షలు, ఇతర పనులకు రూ.25 లక్షలు కేటాయించారు.
- రూ.కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న భవనాలు.. పునాదులు, పిల్లర్ల దశలోనే ఉన్నాయి. బంజారా భవన్‌కు రూ.1.20 కోట్లు, అంబేద్కర్ భవన్‌కు రూ.2.15 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు.

### బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి..



ఇల్లెందులపాడు వాగుపై బ్రిడ్జి నిర్మాణం వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేయాలి. లేదంటే మళ్లీ వర్షాకాలంలో వాగు దాటే పరిస్థితి ఉండదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు వేగవంతమయ్యేలా చూడాలి. ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ డీవీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– కటకం పద్మావతి, కౌన్సిలర్, ఇల్లెందులపాడు

### సీఎం దృష్టికి సమస్యలు...



నిధులు లేక నిలిచిపోయిన పనులు, నూతనంగా శ్రీకారం చుట్టబోతున్న పనులు మొత్తం సుమారు రూ. 25 కోట్లతో పాటు మరికొన్ని నిధులు కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశాము. నిధులు రాగానే అన్ని పనులు పూర్తి చేయాస్తాం.

– డీవీ, చైర్మన్, ఇల్లెందు మున్సిపాలిటీ

# సాదాసీదాగా సామాజిక తనిఖీ


నివేదిక చదువుతున్న అధికారులు

సుజాతనగర్: మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు 12 నెలల కాలంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా జరిగింది. ఎంపీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు లేకుండానే తనిఖీ బృందాలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు నిర్వహించిన పనులపై జిల్లా రిసోర్స్ పర్సన్ జరిపిన ఆడిట్ నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో హరితహారంలో నాటిన వేలాది మొక్కలు చనిపోయాయని, కొన్ని గ్రామాల్లో మస్టర్లు లేకుండా పనులు చేశారని, పలుచోట్ల కూలీ డబ్బులు ఇప్పటి వరకూ రాలేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సాంకేతిక తప్పిదాల నేపథ్యంలో రూ.9 వేల జరిమానాతో పాటు, రూ.20,249 అధికారులు రికవరీకి ఆదేశించారు. 12 నెలల కాలంలో పనులకు గాను రూ.4.12 కోట్లు ఖర్చు చేయగా... వేతనాల రూపంలో రూ.3.72 కోట్లు చెల్లించారు. అడిషనల్ పీడీ రవి, విజిలెన్స్ అధికారి రమణ, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఏపీఓ చందర్, డీఆర్‌పీ పాల్గొన్నారు.

# యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


విజేతలకు బహుమతులు అందిస్తున్న కొత్వాల

పాల్వంచ: యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నారాయణరావుపేటలో 15 రోజులుగా నిర్వహిస్తున్న టీవీఎస్ మెమోరియల్ క్రికెట్ కప్ పోటీలు మంగళవారం ముగిసాయి. ప్రథమ బహుమతి పినపాకకు చెందిన సురేశ్ 11 జట్టు రూ.20వేలు, ద్వితీయ కలర్స్ 11జట్టుకు రూ.10వేలు, తృతీయ రూ.5వేలు, షీల్డ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో కొత్వాల మాట్లాడుతూ.. కరోనా సమయంలో మృతి చెందిన నారాయణరావుపేట గ్రామానికి చెందిన మేకా త్యాగరాజు, కోళ్ల వెంకటేశ్వరరెడ్డి, దేవరకొండ సురేశ్, రేగలగడ్డ చంద్రశేఖర్, కొల్లు వెంకటరెడ్డి, యర్రబోతు పుల్లయ్య జ్ఞాపకార్థం యర్రబోతు సంతోష్‌కుమార్, గుండమల్ల అఖిల్, కాటారపు వంశీల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, తోట దేవీప్రసన్న, కొండం వెంకన్న, శారద, యర్రబోతు సంతోష్‌కుమార్, దారా చిరంజీవి, సురేందర్‌రెడ్డి, శాంతి వర్ధన్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎండీకి వినతి


సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఇటీవల విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో ఫౌండ్రిమెన్ /మౌల్డర్ పోస్టులు ఇవ్వాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు మౌల్డర్ ట్రేడ్ అభ్యర్థులు మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. బాధితులు మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల తరువాత యాజమాన్యం నుంచి వెలువడిన నోటిఫికేషన్‌లో ఐటీఐ మౌల్డర్ ట్రేడ్ చేసిన వారికి ఉద్యోగ అవకాశం వస్తుందని భావించామని, నిరాశ ఎదురవుతోందని, ఒక్కపోస్టు కూడా కేటాయించకపోవడంతో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పదో తరగతి పరీక్షలు ప్రశాంతం


ఇల్లెందు: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఇల్లెందు: పట్టణంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం హిందీ పరీక్ష పట్టణంలోని ఏడు సెంటర్లలో జరగగా 1,182 మందికి 1,178 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. డీఈఓ వెంకటేశ్వరచారి, జిల్లా పరీక్షల విభాగం కోఆర్డినేటర్ మాధవరావు మెయిన్‌రోడ్ హైస్కూల్, చల్లసముద్రం కేంద్రాలను తనిఖీ చేశారు.

**పరీక్ష కేంద్రాల తనిఖీ**

జూలూరుపాడు: మండల కేంద్రంలోని టెన్త్ పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందాలు మంగళవారం తనిఖీ చేశారు. రెండు అధికారుల బృందాలు వేర్వేరుగా జూలూరుపాడు, వెంగన్నపాలెం పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వాహణ తీరుపై ఆరా తీశారు.

# మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధిద్దాం


నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ఏ నబీ కోరారు. సోమవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నబీ మాట్లాడుతూ.. తెలంగాణలో భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం సాగిన పోరాటంలో 14 ఏళ్ల వయస్సులోనే తుపాకీ పట్టిన వీర వనితి మల్లు స్వరాజ్యం అన్నారు. నైజాం సర్కార్‌ను గడగడలాడించిన స్వరాజ్యం కమ్యూనిస్టు పార్టీలో క్రమశిక్షణ కలిగిన సైనికురాలుగా పని చేశారని కొనియాడారు. తెలంగాణలో లక్షల ఎకరాలు జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాముల నుంచి భూములు లాక్కుని పేదలకు పంచిపెట్టారని తెలిపారు. ఆమె చూపిన మార్గంలో పయనించటమే నిజమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, కిరణ్, మోహన్‌రావు, నర్సయ్య, రమేష్, వెంకన్న, నీలరాణి పాల్గొన్నారు.

## 23న వైస్ చైర్మన్ ఎన్నిక


మాట్లాడుతున్న శ్రీనివాస్‌కుమార్

ఇల్లెందురూరల్: ఇల్లెందు సహకార పరపతి సంఘం వైస్ చైర్మన్ ఎన్నిక ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసకుమార్ తెలిపారు. సహకార పరపతి సంఘం కార్యాలయలో ఈ మేరకు మంగళవారం డైరెక్టర్లకు ఎన్నికల నోటీసులను అందజేశారు. 23న 11 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ, 11:30 వరకు నామినేషన్ల పరిశీలన, 12 గంటలకు అర్హుల జాబితా ప్రకటన, 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, 2:30 అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రకటన, 3 – 5 గంటల వరకు పోలింగ్, 5:30 కు లెక్కింపు, విజేతను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఓటింగ్ బ్యాలెట్ పద్ధతిలో ఉంటుందని చెప్పారు. ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా డైరెక్టర్లు సహకరించాలని కోరారు.

## వసతులు కల్పించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రామవరంలోని కమ్యూనిటీ హాల్‌లో ఓపెన్ స్టేజీ, షెడ్ నిర్మాణం, ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఏరియా జీఎం ఎం.శాలేంరాజుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ నిర్మించినా సరైన వసతులు లేకపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. స్పందించిన జీఎం ఏజీఎం (సివిల్)కు సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారని రజాక్ తెలిపారు.

# గ్రంథాలయానికి ఇన్వర్టర్ వితరణ


ఇన్వర్టర్ అందజేస్తున్న నగేష్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని జిల్లా గ్రంథాలయానికి ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు దారా నగేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఇన్వర్టర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దారా నగేష్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు, గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఇన్వర్టర్‌ను వితరణ చేసినట్లు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి.వరలక్ష్మీదేవి, జి.మణిమృదుల, నవీన్‌కుమార్, దారా రమేష్, కొయ్యడా నగేష్, నరేంద్రుల రుషికుమార్, జూలూరి ఆనంద్, దారా శీను, గణేష్, కిరణ్, పాఠకులు పాల్గొన్నారు.

# నేడు విగ్రహ ప్రతిష్ఠ

ఇల్లెందురూరల్: నాయకులగూడెంలో నూతనంగా నిర్మించిన సాయిబాబా, శ్రీగురు దత్తాత్రేయ ఆలయాల్లో బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. మంగళవారం గ్రామంలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయాల ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ధాన్యాదివాసం, జలాధివాసం, పుష్పాదివాసం నిర్వహించారు. అనంతరం అన్నదానం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.


విగ్రహాలకు పూజ చేస్తున్న మహిళలు

# ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

టేకులపల్లి: గంగారం పంచాయతీ సంపత్‌నగర్‌లోని కొండపై వెలిసిన వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం యాజ్ఞికులు శ్రీరంగం అజయ్ సాయి చక్రిచార్యులు, శ్రీరంగం విజయ్ సాయి చక్రిచార్యుల అర్చకత్వంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆళ్లపల్లికి చెందిన భారతి ఫెర్టిలైజర్స్ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు కొండపల్లి రాజగోపాలకిషన్ – రజిత, అనువంశిక పారంపర్య ధర్మకర్తలు అజయ్‌కుమార్ – సునాలిని, పవన్ రావు – మంగతాయారు, అర్చకులు రమేష్ ఆచార్యులు, అక్కినపల్లి సోమాచార్యులు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య – లక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

టేకులపల్లి: కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిష్ఠాచార్యులు మారోజు శ్రీనివాసాచార్యులు, విక్రమాచార్యులు, చైతన్య చార్యులు, రవితేజాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


లక్ష్మీపురంలో అభయాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న అర్చకులు

# పదిరోజులుగా తాగునీటి కటకట..

టేకులపల్లి: టేకులపల్లి మండలం కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురంలో పది రోజుల నుంచి తాగు నీటి కష్టాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. డైరెక్ట్ పంపింగ్ (డీపీ) మోటారు పని చేయడం లేదు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల నుంచి గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు జరుగుతున్నాయి. నీరు లేక సమీపంలోని వాగు వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. మనుషులకే కాకుండా పశువులకు కూడా నీరు లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి లక్ష్మీపురంలో నీటికి ప్రత్యామ్నాయ సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం



టేకులపల్లి: కోయగూడెంలో అన్నప్రాసన, కుంటల్ల గ్రామంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


జూలూరుపాడులో సీమంతం...

టేకులపల్లి: పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని టేకులపల్లి, బొమ్మనపల్లి, బోడు, గంగారం, సులానగర్ సెక్టార్ల పరిధిలో జరిగిన పోషణ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, రక్తహీనత తగ్గించుకోవడం గురించి వివరించారు. సూపర్‌వైజర్లు సక్కుబాయి, నిర్మల, యశోద, లక్ష్మి, అనురాధ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. చేతులను శుభ్రం చేసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది చందన, ఫాతిమా, స్రవంతి, కళావతి, కోటమ్మ, బుజ్జి, రాధ, సోని, వెన్నెల, అనసూర్య, శకుంతల, సుజాత, రాంబాయి, సునీత, శారద, జ్యోతి, బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: బచ్చలకోయగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్ రాంబాయి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా పాపకొల్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల మాట్లాడుతూ... పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే తల్లి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఉపాధ్యాయులు వీరస్వామి, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ సుబ్బు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.